కరుణించని వరుణుడు

- ముందస్తు వర్షాలతో పంటల సాగు
- రెండు నెలలుగా ముఖం చాటేసిన వరుణుడు
- వేలాది హెక్టార్లలో వాడుముఖం పట్టిన పంటలు
- తీవ్ర ఆందోళనలో రైతులు





పాండవగల్‌లో వర్షాలు లేక ఎండిపోయిన వేరుశనగ పంటలో దిగాలుగా కూర్చొన్న రైతు, ఎదుగుదల లేక ఎండిపోయిన పత్తి పంటను పరిశీలిస్తున్న రైతు

ఆదోని రూరల్‌: ముందస్తుగా కురిసిన వర్షాలకు అన్నదాతలు మురిసిపోయారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయి, పంటలు బాగా పండుతాయని ఆశించారు. తీరా పంటలను సాగుచేసిన తర్వాత వరుణుడు పూర్తిగా ముఖం చాటేయడంతో ఆందోళన చెందుతున్నారు. పంటలను సాగుచేసిన రెండు నెలలైనా వర్షం జాడ లేకపోవడంతో పంటలు ఎదుగుదల లేక ఎండుముఖం పడుతున్నాయి. లక్షలాది రూపాయలను అప్పులు చేసి పంటలను సాగుచేస్తే.. అప్పులే మిగిలేలా ఉన్నాయని రైతులు కంటతడి పెట్టుకుంటున్నారు.

23,908 హెక్టార్లలో పంటల సాగు

ఆదోని మండలంలో ప్రతిఏటా 30,976 హెక్టార్లలో వేరుశనగ, పత్తి, ఆముదం, కొర్ర, సజ్జ, మిరప, మొక్కజొన్న, కంది తదితర పంటలను సాగు చేస్తారు. ఆదోని మండలంలో ఈ ఏడాది మే నెల చివరి వారంలో ముందస్తుగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు పత్తి, వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలను సాగుచేశారు. జూన్‌ రెండో వారం వరకు వర్షాలు సమృద్ధిగా పడ్డాయి. ఆ తర్వాత కురవకపోవడంతో కొందరు రైతులు పంటలను సాగుచేయలేకపోయారు. దీంతో ప్రస్తుతం ఇప్పటివరకు 23,908 హెక్టార్లలో రైతులు ఆయా రకాల పంటలను సాగయ్యాయి. మండలంలోని జాలిమంచి, పెద్దహరివాణం, పెద్దతుంబళం, ఇస్వీ, కడితోట, సాంబగల్‌, కపటి తదితర గ్రామాల్లో రైతులు ఆయా రకాల పంటలను సాగుచేశారు. వేరుశనగ 1181 హెక్టార్లు, పత్తి 21,816 హెక్టార్లు, మిరప 483 హెక్టార్లు, కంది, 164 హెక్టార్లలో సాగు అయ్యింది. ఇంకా 7,068 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉంది.

ఈనెల 15 వరకు పంటల సాగుకు అవకాశం

ఈనెల 15వ తేదీ వరకు వివిధ రకాల పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, కొర్ర, సజ్జ తదితర పంటలను సాగుచేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఉంది.

వర్షాలు కురిస్తే పంటను వేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

బెట్టను తగ్గించుకునేందుకు ఎరువులు వేసుకోవాలి



గత 20 రోజుల నుంచి వర్షాలు రాకపోవడంతో పంట ఎదుగుదల ఆగిపోయింది. వర్షాధార పంటలైన వేరుశనగ, కంది, ఆముదం పంటలు బెట్టకు గురయ్యా. కొంతవరకు బెట్టను అధిగమించేందుకు రైతులు 19:19:19 మందును 10 గ్రాములల చొప్పున ఒక లీటర్‌ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. పంట కీలక దశలో నీటివసతి గల రైతులు ఒక రక్షణ తడి ఇవ్వాలి. రైతులు ఆగస్టు నెలలో ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి సన్నద్ధం కావాలి. వర్షాధార ఎర్ర నేలల్లో వేసుకోవాల్సిన ప్రత్యామ్నాయ పంటల్లో కంది, జొన్న, కొర్ర, సజ్జ, అలసంద, ఉలవ, ఆముదం, పెసర అనుములు ఉన్నాయి. వర్షాధార నల్లరేగడి నేలల్లో ప్రత్యామ్నాయ పంటలుగా కంది, ఆముదం, పత్తి పంటలను ఆగస్టు మొదటి వారం వరకు విత్తుకోవచ్చు. రైతులు వర్షాధార వేరుశనగ పంటలో నీటి సంరక్షణ సాళ్లను 3.6 మీటర్లకు ఒక సాలు చొప్పున పంట విత్తేటప్పుడు లేదా విత్తిన 20–30 రోజులకు తప్పనిసరిగా వేసుకోవాలి. ఈ సాళ్లు బెట్ట సమయంలో పంటకు నీటి సంరక్షణకు ఉపయోగపడమే గాక అధిక వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు పోయే కాలువలుగా ఉపయోగపడతాయి. వర్షపునీరు ఈ సాళ్లల్లో ఇంకడం వల్ల పైరు త్వరగా బెట్టకు గురికాకుండా ఉంటుంది.

– అశోక్‌కుమార్‌ రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఆదోని

వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయింది



జూన్‌ నెలలో నాకున్న మూడు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగుచేశా. జూలై నెలలో వర్షాలు రాకపోవడంతో పంట పూర్తిగా ఎదుగుదల లేక ఎండిపోయింది. విత్తనం సాగుకు, ఎరువుకు రూ.50 వేల దాకా పెట్టుబడి పెట్టాను. పంట పెట్టుబడి, మనిషి కష్టం మట్టిపాలయ్యింది. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. చేసిన అప్పులను తీర్చేందుకు భార్య, పిల్లలతో కలిసి వలస వెళ్లాల్సిన పరిస్థితి.

– వీరప్ప, పెద్దతుంబళం రైతు

పంటలు సాగుచేసి నష్టపోయా



ఈ ఏడాది మే చివరి వారంలో కురిసిన ముందస్తు వర్షాలకు పంటలను సాగుచేసి నష్టపోయా. 25 ఎకరాలను కౌలుకు తీసుకున్నాను. ఐదు ఎకరాల్లో వేరుశనగ, 20 ఎకరాల్లో పత్తి పంటలను సాగుచేసి రూ.4 లక్షల దాకా నష్టపోయాను. జూలై నెలలో వర్షం వచ్చి ఉంటే వేరుశనగ, పత్తి పంటలకు ఎదుగుదల ఉండేది. వర్షాలు రాకపోవడంతో పంట ఎదుగుదల లేక వాడుముఖం పట్టింది.

– నెంబి తిక్కయ్య, కౌలురైతు, జాలిమంచి గ్రామం

క్లుప్తంగా

ఘనంగా శ్రీ చౌడేశ్వరిదేవి జయంతి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆలయ అధ్యక్షుడు మఠం రామాంజినేయులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారి జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కుంకుమాభిషేకం, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు ఆకుపూజ చేపట్టి మహా మంగళహారతులు ఇచ్చారు. అమ్మవారికి గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన చౌడేశ్వరి దేవి జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామున ఆలయంలో సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, ప్రత్యేక పూజల అనంతరం దేవికి అలంకరించి గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి భక్తిని చాటుకున్నారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు



పూజలందుకుంటున్న బసవేశ్వరుడు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్‌ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు భక్త భజనలతో అలరించారు.

ఈరన్న చెంతకు పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరుతున్న విజయేంద్రరెడ్డి

పెద్దకడబూరు: శ్రావణ అమావాస్యను పురస్కరించుకొని ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ కమిటీ సభ్యుడు విజయేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వందల సంఖ్యలో భక్తులు పెద్దకడబూరు నుంచి ఉరుకుందకు పాదయాత్రగా బయలుదేరారు. విజయేంద్రరెడ్డి మాట్లాడుతూ 7 సంవత్సరాలకు పైగా ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షద్రక్‌కు ఘన నివాళి



షద్రక్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్‌: పట్టణంలోని కేవీపీఎస్‌ కార్యాలయంలో ఆదివారం సీపీఎం రాష్ట్ర నాయకుడు షద్రక్‌ 4వ వర్ధంతి సభను నిర్వహించి కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్‌ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రామన్నలు మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆంథోని, రాజు, తిమ్మన్న, గుండప్ప, లక్ష్మినర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వివాదాలను పరిష్కరించాలి

ఆదోని రూరల్‌: మండలంలో మధ్యాహ్న భోజన పథకంలో నెలకొన్న వివాదాలను త్వరగా పరిష్కరించాలని ఎస్టీయూ మండల కార్యదర్శి పి.షేక్షావలి, రాష్ట్ర అకాడమిక్‌ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్‌ మహాదేవప్ప కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో కౌతాళం మండల ఎస్టీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని మండిగిరి ఆర్‌.జి.నగర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, మండల పరిషత్‌ ప్రాథమికోన్నత పాఠశాల, గణేకల్‌ తదితర పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ మార్పు విషయంలో రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు వివాదాలు సృష్టించుకోవడం ద్వారా హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి యం.సి.సుంకన్న, జిల్లా కార్యదర్శి బి.గోపాల్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న వామ్‌ మహిళా సభ్యులు

ఆదోని అర్బన్‌: ఆదోని వామ్‌ అండ్‌ లైన్స్‌ క్లబ్‌ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన సభ, స్నేహితుల దినోత్సవ సంబరాలను ఆదివారం చేపట్టారు. తల్లిపాల ఆవశ్యకత గురించి, పిల్లలకు అవి చేసే మేలు గురించి గైనకాలజిస్ట్‌ డాక్టర్‌ వరప్రసన్న వివరంగా తెలియజేశారు. 300 మందికి పైగా హాజరైన ఆదోని పట్టణ చిన్నారులు కలిగిన తల్లులకు డాక్టర్‌ సలహాలు, సూచనలు తెలియజేశారు. అలాగే ఆగస్టు నెల మొదటి ఆదివారం జరుపుకునే స్నేహితుల దినోత్సవం కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం యొక్క విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో ఆదోని లైన్స్‌ క్లబ్‌ ధ్యక్ష కార్యదర్శులు ధర్మారెడ్డి, వంకదారు శ్రీనాథ్‌గుప్తా, జిల్లా చైర్మన్‌ ప్రసాద్‌రావు, వామ్‌ అధ్యక్ష కార్యదర్శులు రఘు, సభ్యులు డాక్టర్‌ రంజిత్‌ తదితరులు పాల్గొన్నారు.

మధురమైనది స్నేహ బంధం

ఆదోని సెంట్రల్‌: సృష్టిలో మధురమైనది స్నేహ బంధమేనని ఉజ్వల మిత్ర మండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్‌ కుమార్, సత్య సమన్వయకర్తలు ప్రహ్లాద్, స్వామినాథ తెలిపారు. ఆదివారం ఉజ్వల మిత్ర మండలి సభ్యులందరూ కలుసుకుని ఫ్రెండ్‌ షిప్‌ డేను ఘనంగా జరుపుకున్నారు. కేక్‌ కట్‌ చేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలను తెలుపుకున్నారు. కార్యక్రమములో వెంకటేష్, కేశవ, నరసింహారాజు, రామన్న, ఉరుకుంద, అంజి తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ కట్‌ చేస్తున్న ఉజ్వల మిత్ర మండలి సభ్యులు

బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్‌

ఆదోని రూరల్‌: మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలు దేశానికి ప్రమాదకమరని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్‌ అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆదోని పట్టణంలోని భవసార కళ్యాణ మండపంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు లాభం చేకూర్చే విధంగా ఈ మధ్యనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. బడ్జెట్‌లో కార్మికులు, కర్షకులు, రైతాంగానికి, మధ్యతరగతి, సామాన్య ప్రజానీకానికి ఏవిధమైన ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా విభజన చట్టంలో హామీలు ఏవీ అమలు చేయకుండా రాజధానికి మాత్రమే రూ.15 వేల కోట్లు అప్పుగా ఇవ్వడం అన్యాయమని అన్నారు. వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా ఆదోనిప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రధానంగా వలసల నివారణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం గురించి ఎక్కడా ప్రస్తావన చేయడంలేదని విమర్శించారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవడంలో జాప్యమెందుకు?

ఎమ్మిగనూరుటౌన్‌: సరైన భోజనం పెట్టకపోవడం అర్థాకలితో విద్యార్థినులను ఇబ్బందులకు కారణమైన స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్‌ కవితపై చర్యలు తీసుకోవడంలో అధికారులు జాప్యం చేయడం శోచనీయమని విద్యార్థి సంఘ నాయకులు మండిపడ్డారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, ఉదయ్, రాజేష్, వీరేష్‌యాదవ్, సోమశేఖర్, సురేష్, ఖాజ,కృష్ణలు మాట్లాడారు. కేజీబీవీలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టక కనీస సౌకర్యాలు అందించడంలో విఫలమైన ప్రిన్సిపాల్‌పై విద్యార్థినుల ఫిర్యాదులపై పది రోజుల క్రితం జిల్లా విద్యాశాఖ శ్యాముల్‌పాల్, డిప్యూటీ ఎడ్యుకేషనల్‌ ఆఫీసర్‌ వెంకటరమణారెడ్డి, జీసీడీఓ స్నేహలత, ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రావులు విచారణ చేశారన్నారు. అయితే ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేవలం షోకాజ్‌ నోటీసు జారీ చేసి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు మంజు, గణేష్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

దిగువ కాలువ నీటివాటాను అందించాలి

ఆదోని రూరల్‌: తుంగభద్ర దిగువ కాలువ నుంచి రైతులకు రావాల్సిన నీటి వాటాను అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని, వలసలను నివారించాలని జిల్లా తెలుగు రైతు సంఘం అధికార ప్రతినిధి సాయిబాబా సీఎం చంద్రబాబునాయుడికి విన్నవించారు. ఆదివారం విజయవాడలో సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. అలాగే జిల్లాలో అత్యంత వెనకబడిన మంత్రాలయం నియోజకవర్గంలో అధిక భాగం వర్షాధారంపై ఆధారపడి రైతులు, ప్రజలు జీవిస్తున్నారన్నారు. పంటలు పండకపోవడంతో వలసలు వెళ్తున్నారన్నారు. వలసల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు స్పందించి సీఎం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సాయిబాబా తెలిపారు.

స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ



పిల్లలకు మందు వేస్తున్న అవోపా సభ్యులు

ఆదోని అర్బన్‌: ఆర్యవైశ్య అఫీషియల్స్‌ అండ్‌ ప్రొఫెషన్‌ అసోసియేషన్‌ (అవోపా) వారి ఆధ్వర్యంలో వికాస తరంగిణి వారి సహకారంతో ఎన్‌ఆర్‌ఐ కాకుబాళ్‌ నగేష్‌ వారి సహకారంతో శ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆశీస్సులతో అపురూప రోగనిరోధక 'స్వర్ణామృత ప్రాసనం' మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక అభయ ఆంజనేయస్వామి ఆలయంలో 389 మంది చిన్నారులకు మందు అందజేసినట్లు పట్టణ అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. ఎన్‌ఆర్‌ఐ కాకుబాళ్‌ నగేష్‌ మాట్లాడుతూ పిల్లలకు ఈ మందు ద్వారా రోగ నిరోధకశక్తి పెంచడానికి, మేధాశక్తిని, ఆయుష్షును, చర్మ సౌందర్యాన్ని, మానసిక ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్ష కార్యదర్శులు డైమండ్‌ రఘు, సభ్యులు వెంకటేశ్వర్లు, డా.రంజిత్, ప్రసాద్‌రావు, అవోపా మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, గీత, శ్రీదేవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖీ

ఎమ్మిగనూరురూరల్‌: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం పంట సాగు, సమగ్ర యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు – రైతుల ముఖాముఖీ ఉంటుందని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌ డా.కే.రాఘవేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే రైతులకు పొద్దుతిరుగుడు పువ్వు మినీకిట్స్, విత్తనాలు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. అలాగే కేవీకేలో కొర్ర విత్తనాలు, ట్రైకోడర్మ, సుడోమోనాస్‌ అందుబాటులో ఉన్నాయని, రైతులు తీసుకెళ్లాలని కోరారు.

వర్షం కోసం ముస్లింల ప్రార్థనలు



పొలాల్లో నమాజు చేస్తున్న ముస్లింలు

ఎమ్మిగనూరురూరల్‌: మండల పరిధిలోని కోటేకల్‌ గ్రామంలోని పొలాల్లో ఆదివారం ముస్లిం మతగురువులు జక్రియ, మౌలానామహమ్మద్, కీజూర్‌పీరాల ఆధ్వర్యంలో వర్షం కోసం ముస్లింలు ప్రార్థనలు చేశారు. వర్షాలు రాకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని అందుకే దేవున్ని ప్రార్థించినట్లు మతగురువులు తెలిపారు. దేవుడు రైతులు మొర ఆలకించి వర్షం వచ్చేలా చేయాలని కోరారు.

కౌతాళంలో పూజలు



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కౌతాళం: వర్షం కురవాలని మండల కేంద్రమైన కౌతాళంలో ఆదివారం దేవాలయాలకు, దర్గాలకు, బోడ్డురాళ్లకు నీళ్లు పోసి పూజలు చేసి 101బిందెలతో జలాభిషేకం చేశారు. ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమై పంటలు సాగుచేసుకుని రెండున్నర నెలలు గడిచినా వర్షం లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వర్షం రాకపోతే ఈ దేవుళ్లకు నీళ్లతో అభిషేకం చేస్తే వానలు పడుతాయన్న నమ్మకంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

అనుమానితుల ఇళ్లలో కార్డన్‌సెర్చ్‌



కార్డన్‌ సెర్చ్‌ నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్‌: ఆదోని వన్‌టౌన్‌ పోలీసులు, కోసిగి, ఎమ్మిగనూరు, ఆదోని సెబ్‌ పోలీసులు ఆదివారం సాయంత్రం పట్టణంలోని బోయగేరి, వాల్మీకినగర్, కామెలి, రణమండల కొండల ప్రాంతాల్లో కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. ఇందులో ఒక వ్యక్తి వద్ద 45 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. 20 లీటర్ల నాటుసారా, 80 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మొత్తం రెండు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడుల్లో ఎమ్మిగనూరు సెబ్‌ స్టేషన్‌ సీఐ భార్గవరెడ్డి, సిబ్బంది రమేష్, ఆదోని వన్‌ టౌన్‌ ఎస్‌ఐ నాయుడు, ఎమ్మిగనూరు సెబ్‌ ఎస్‌ఐ శివకృష్ణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రణమండల అంజనేయస్వామి దీక్షలు

ఆదోని అర్బన్‌: పట్టణంలో రణమండల ఆంజనేయస్వామి దీక్షలు సోమవారం నుంచి మొదలుకానున్నాయని గురుస్వామి శ్రీనివాసులు స్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం మొదలుకావడంతో ఆసక్తి ఉన్న వారు స్వామివారి మాలలు ధరించి 41 దినములు దీక్షను చేపడతారన్నారు. ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం చేసి స్వామివారిని స్మరిస్తూ భజన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. 41 రోజుల కఠినదీక్ష అనంతరం ఇరుముడిని కట్టుకొని కొండపై ఉన్న స్వామివారికి సమర్పించి దీక్ష ముగిసినట్లు చెప్పారు.

ఈరన్నస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్షేత్రం వద్ద భక్తుల సందడి



ఈరన్న స్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడిగా నెలకొంది. ఆదివారం అమావాస్య ఉండడంతో పాటు సోమవారం నుంచి ఈరన్నస్వామి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం అవుతుండడంతో భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చి అమావాస్య వేడుకల్లో పాల్గొనడంతో దేవాలయ పరిసర ప్రాంతాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. దీంతో దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహా మంగళహరతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. భక్తులకు విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ దర్శనాలకు అవకాశం కల్పించారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో సైతం భక్తులు గంటకుపైగా నిలబడాల్సి వచ్చింది. పిండివంటలు వండి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ డిప్యూటీ కమిషనర్‌ గురుప్రసాద్, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకార్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోల వారు ప్రత్యేక బస్సులను నడిపారు.

బుదుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో..

మండలంలోని బుదుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తుల సందడిగా నెలకొంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజినేయస్వామిని దర్శనానికి కూడా తరలి రావడంతో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

రామలింగేశ్వరస్వామి ఆలయం..

తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు. కర్ణాటక సరహద్దు ప్రాంతం కావడంతో అధికంగా కర్ణాటక భక్తులు కూడా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవెద్యం సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య వేడుకలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాల్లో ఒకటైన మండల కేంద్రమైన కౌతాళంలో హిందూ ముస్లిం అన్న బేధభావం లేకుండా మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలకు వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో శనివారం సాయంత్రం నుంచే భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. కొంతమంది భక్తులు పిండి వంటలు వండి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్‌ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

వరద కాలువ నిర్మించి రైతులను ఆదుకోండి



తుంగభద్ర నది వద్ద సీపీఎం నాయకులు

కౌతాళం: తుంగభద్ర నదికి వరద కాలువ నిర్మించి రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండు చేశారు. ఆదివారం తుంగభద్ర నదిని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ముందస్తు వర్షాలతో పంటలు సాగుచేసినా ఆతరువాత వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. ప్రధానంగా వేరుశనగ, కొర్ర, మిరప, పత్తి, ఇతర పంటలు పూర్తిగా ఎండిపోయే దశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల్ని ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు. మండలంతో పాటు నియోజవర్గానికి జీవనాధారమైన తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మిస్తే మంత్రాలయం నియోజకవర్గతో పాటు ఐదు నియోజకవర్గాలు సస్యశ్యామలమవుతాయని తెలిపారు. ప్రతి రోజు 1.50లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలోకి పోతున్నాయన్నారు. కార్యక్రమలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.